# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారత్ వ్యవసాయం, ఆహార ధాన్యాలలో స్వావలంబన సాధించడంలో ఎం.ఎస్ స్వామినాథన్ కీలక పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**
2. **గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతున్న 11వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.**
3. **ప్రజలకు మేలు చేసే విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు.**
4. **కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ పేర్కొన్నారు.**

==========================

భారత దేశం వ్యవసాయం, ఆహార ధాన్యాలలో స్వావలంబన సాధించడంలో ఎం.ఎస్ స్వామినాథన్ కీలక పాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుని ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, దేశంలో హరిత విప్లవానికి స్వామినాథన్ నాంది పలికారని చెప్పారు. ధాన్యం ఉత్పత్తిని పెంచడానికి కృషి చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చారని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 34 సెకన్లు

-------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతున్న 11వ జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో చేనేత ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికుల కుటుంబాలతో ముఖ్యమంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

-------------------------

చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల అమలు చేస్తున్నాయని అనంతపురం జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి పి.వర ప్రసాద్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో ఈరోజు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికులు సహకార సంఘాల ద్వారా తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు.

---------------------------

చేనేత కార్మికుల నైపుణ్యాలను భావితరాలకు అందించేలా వారికి ఆర్థిక చేయూతనివ్వాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... చేనేత కార్మికులు ఎంతో నైపుణ్యంతో వస్త్రాలను తయారు చేస్తున్నారని వాటిని అందరూ కొనుగోలు చేయాలని కోరారు.. వాతావరణ పరిస్థితులకు చేనేత వస్త్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.

---------------------------

తల్లి పాల ద్వారా బిడ్డలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తాడేపల్లిగూడెం శిశు అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారిణి ఎల్ సరస్వతి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై ఈ రోజు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,బిడ్డ పుట్టిన మొదటి అరగంట లోపు తల్లి నుండి వచ్చే ముర్రుపాలు బిడ్డకు సమతుల పోషకాహారాన్ని అందజేస్తాయని చెప్పారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లలోనూ మదర్ ఫీడింగ్ గదులను ఏర్పాటు చేశామని తెలిపారు.

---------------------------

ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఏలూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ తెలిపారు. “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమంలో భాగంగా ఏలూరులో నిన్న ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, త్రివర్ణ పతాకంపై అవగాహన కల్పించేలా రంగోలి, తిరంగా రాఖీ తయారీ వంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. దేశ సమైక్యతను తెలిపే ఈ ఉత్సవంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాలు పంచుకోవాలని కోరారు.

---------------------------

ప్రజలకు మేలు చేసే విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలను అమలు చేయనున్నామని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా సస్యశ్యామలంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 32 సెకన్లు

---------------------------

భారతీయ జనతా పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జిల్లాల పర్యటనలు చేస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. సారథ్యం –జిల్లాల పర్యటనలలో భాగంగా ప్రకాశం జిల్లా

ఒంగోలులో స్థానికులతో  నిర్వహించిన 'చాయ్ పే చర్చా' కార్యక్రమంలో ఆయన ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో  పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం  సహకారంతో ఈ ఏడాదిలో రాష్ట్రానికి  10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని, వీటి ద్వారా సంపద సృష్టి జరుగుతోందని మాధవ్ పేర్కొన్నారు.

-------------------------

విశాఖపట్నంలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్–విశాఖపట్నం జిల్లా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ మైదానంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్– ఏపీఎల్ 4వ ఎడిషన్‌ను రేపు ప్రారంభిస్తామని ఏపీఎల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు తెలిపారు. ఈరోజు విశాఖపట్నంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏపీఎల్‌లో ఏడు జట్లు పోటీ పడతాయని, ఈ మ్యాచ్‌లకు ప్రవేశం ఉచితమని తెలిపారు.  ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

-------------------------

విశాఖపట్నంలో నవంబర్ 14,15 తేదీల్లో  నిర్వహించనున్న భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సు విజయవంతానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో  సీఐఐ భాగస్వామ్య సదస్సు–2025 ను సమన్వయం చేసేందుకు ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం తొలి సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ప్రపంచ నలుమూలల నుంచి పెట్టుబడులు ఆకర్షించే విధంగా సదస్సును విజయవంతం చేయాలన్నారు. తద్వారా రాష్ట్రంలో ఉపాధి, ఆర్థిక రంగాలు బలోపేతమవుతాయని మంత్రి తెలిపారు.

-------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు  ఈ రోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి  సెన్సెక్స్ 421 పాయింట్ల నష్టంతో  80 వేల 118 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 139 పాయింట్ల నష్టంతో 24 వేల 435  వద్ద ట్రేడవుతోంది.

-------------------------

ఉత్తర తమిళనాడు తీరం, రాయలసీమ పరిసర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ....

వాయిస్...17 సెకన్లు

-------------------------

మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మాజీ సైనికుల కోసం ఏర్పాటు చేసిన  న్యాయ సేవా కేంద్రాన్ని ఆయన ఈరోజు  ప్రారంభించారు.

=====================